చంద్రాయణం చంద్రప్ప వయస్సు ముప్పై సంవత్సరాలు. మేనమామ రాగప్ప-కూతుర్ని స్తాడనే ఆశతో, ఆ పిల్లపైననే ఆశ పెట్టుకొని, శరీరానికి పాతిక సంవత్సరాల వయస్సు వచ్చిందాకా ఆగాడు.

పాతిక వయస్సు దాటుతుండగా - మేనమామగారి కూతురు ప్రక్కింటి సత్యనారాయణమూర్తిని తీసుకొని- చెప్పాచెయ్యకుండా వెళ్ళిపోయి, గుళ్ళో పెళ్ళి చేసుకుని తిరిగి వచ్చింది. సత్యనారాయణ మూర్తికి బ్యాంకులో ఉద్యోగం వుంది. రెండెకరాల అంటుమామిడితోట వుంది, తినా కుడువా వున్నవాడు. కనుక-కిమ్మనకుండా ఆశీర్వదించి- ఇంటికి ఆహ్వానించేసాడు మామ.

ఈ కథ తెలిసింతరువాత చంద్రాయణం చంద్రప్ప అగ్గిబరాటా అయి- మేనమామ సంగతి అమీతుమీ తేల్చెయ్యాలని నిశ్చయించుకొని. సరాసరి మేనమామ రాగప్ప ఇంటికెళ్ళి. కాళ్ళు కడుక్కోమని ఇంటిల్లపాదీ బ్రతిమాలుతున్నా వినకుండా

# వాయొరిజం

## చావా శివకోటి

"నేను మీవల్ల విలువూ మోసపోయాను. మీకేమో చీమ కుట్టినట్టు లేదు. ఇక మీ మాట నేను వినను గాక వినను. వట్టు. వెంటనే ఏదో ఒక పిల్లను చూసి పెళ్ళాడ తాను" అన్నాడు.

చంద్రప్ప మాటల ధోరణినిబట్టి ఇదేదో ఘట్టిగా అనుకునే వచ్చినాడనుకుని- మొదట కూర్చోమని-కూర్చున్న తరువాత టీ యిచ్చి ప్రశాంత పడ్డాడని అర్థమైం తరువాత "అరే చంద్రం పెద్ద పిల్లను నీకిద్దామని, నేనూ ఖచ్చితంగా అనుకున్నాను ఆ విషయం నీకు తెలుసు కదా! అసలు పుట్టిన కాడ్నుంచి నీకే అనుకున్నాం గదా! కాని అర్ధాంతరంగా ఇది ఇట్లా చేస్తుం దని కలకంటామా? దానికి తోచింది అది చేసింది. తాళి కట్టించుకొని మగడ్ని వెంట పెట్టుకొని మరీ గడపలో అడుగు పెట్టాక ఏం చేసేదిరా! తప్పలేదు. ఎంత కసి మనసులో మెదిలినా. దీవించి ఆశీర్వ దించాల్సే వచ్చింది. నువ్వునా అదే చేసేవాడివి." అని బోలెడు బాధపడి పోయాడు రాగప్ప. ఒక్క నిముషం ఆగి "ఇదిగో చంద్రం! తప్పిపోయిన దాన్ని గురించి నాకు ఆలోచన లేదు. పొరపాటో గ్రహపాటో మన చేతుల్లో లేకుండాపోయింది. ఇకముందు ఏమిటా అని చూసా. మన రెండో పిల్ల విశాలాక్షి లేదూ! దాన్నిమాత్రం- ఇలాంటి పొరపాటు రాకుండా కాపాడి నీకిచ్చి పెళ్ళి చేసి. మా అక్కకిచ్చిన మాటను నిలబెట్టు కుంటాను. నువ్వు 'ఊఁ' అని నాకా అవకాశం కల్గించు" అని బ్రతిమాలాడు చంద్రప్పను. మెతకిపడ్డ పాముకదా మేనమామంటే - అందుకే ఈ శరీరానికి ముప్ఫై ఏళ్ళు వచ్చిందాకా- విశాలాక్షి కోసం ఆగాడు చంద్రప్ప. విశాలాక్షి నిజంగా అక్కకంటే అంద మైందే.

అక్షరజ్ఞానం మాత్రం ఇసుకపై వేలితో వ్రాయించినా కలగలేదు.

అయినా విశాలాక్షి తెలివిగలదే.

తోచింది మినహా- ఇతరత్రా వినడం మాత్రం అస్సలులేదు.

విశాలాక్షి కలివిడయిన మనిషి.

చింతచిగురు కోయటం మొదలు. ఊరి వాళ్ళని అల్లరి పట్టించడం వరకూ తేడా తెలీదు.

విశాలాక్షి మంచి పిల్ల.

ఎంత అల్లరి చిల్లరగా వున్నా బుద్ధిగా వుండేది.

చాలాసార్లు విశాలాక్షి కోసం, తొమ్మిది పదేళ్ళ ఈడు వచ్చిందాకా రాత్రి పూట రాగప్ప లాంతరు పట్టుకుని ఆట బ్యాచీల వద్దకెళ్ళి వెతుకుతుండేవాడు.

విశాలాక్షి ఇప్పుడు పెద్దదైంది.

గడప దాటకూడదని రాగప్ప హద్దు గీశాడు.

నిజంగానే గుమ్మం దాటలేదు విశాలాక్షి.

చంద్రాయణం చంద్రప్పకు మాత్రం రాగప్ప పెట్టిన గడువు ఇంకా ఒక్క సంవత్సరం ఉందనగా. చందనతాంబూలాలేసుకున్నాక-అటూ ఇటూ ఆడగాలి వైపు మనసు పరుగెత్తటం మొదలయింది. స్త్రీ అని స్ఫురిస్తే చాలు. పులుపు మామిడికాయ ధ్యాసలోకొచ్చి నోరూరినట్లుగా-శరీరం. నాలుక, ఏదో అయిపోసాగాయి. ఆడ మనిషిని చీరతోనే కాక, ఇంకా చూడాలనీ- చూస్తేనే బాగు అనీ-కోరికలు కట్లు తెంచుకోసాగినయి.

చంద్రప్ప ఇంట్లో సుబ్బారావు అని బడి పంతులు రెండేళ్ళుగా అద్దెకుంటున్నాడు. ఈ బడి పంతులుకు ఇద్దరు పిల్లలూ, భార్యా ఉన్నారు. ఆవిడ పేరు రేవతి. వయసు ఇరవై అయిదు. ఆరోగ్యమైన మనిషి మాట కలివిడి కల్గినది. చామన ఛాయ అనిపించినా-నీటుగా ఉండి అందగత్తెలే అనిపిస్తుంది.

ఒకనాడు చంద్రప్ప భోజనానికి ఇంటికొచ్చి. కాళ్ళూ చేతులూ కడుక్కొని వద్దామని.సందులోకెళ్ళేసరికి కందికట్టె తడికెతో అల్లిన స్నానాల గది నుంచి రేవతి స్నానం చేస్తుండటం కనిపించింది. ఇక కాళ్ళూ చేతులూ కడుక్కోవటం ఆపాడు చంద్రప్ప. పేగులు కొరుక్కునీ తినే ఆకలి ఏమైందో కూడా అతనికి అర్థం కాలేదు. "తడికెకు ఎక్కడైనా కన్నం ఉంటే బాగు"అనిపించింది మొదట.

"ఆకన్నంలోనుంచి స్నానం చేస్తున్న రేవతిని మొత్తం చూస్తే బాగు" అనిపించింది ఆ వెంటనే. ఇక ఆ పైన చూపినట్టూ. ఏదో చేసినట్టూ- ఆమె వెళ్ళిపోయినాక కూడా చాలాసేపు అక్కడే అచేతనంగా నిలబడిపోయాడు.

తడికచుట్టూ రంధ్రం కోసం అన్వేషణ



మొదలెట్టాడు.

ఆమె వెళ్ళిపోయింది కానకపోవటాన
నీళ్ళు పోసుకునే చప్పుళ్ళూ
వళ్ళు రుద్దుకోవటాలూ
తుడుచుకొని సర్దుకోవటాలూ.

ఊహల్లో ఇంకా చాలా చాలా కనిపించి నయి కనిపించడం లేదనే బాధ మెదిలి. ధైర్యంగా చూసి. ఏమీ కనిపించకపోవటంతో హతాశుడై— దీర్ఘరోగిలాగా జోగుతూ ఇంట్లోకొచ్చి- మంచానికడ్డంగా పడిపోయాడు అది మొదలు— చంద్రప్ప కంటికి కునుకంటూ రాలేదు. అన్నం పూర్తిగా సయించనూలేదు. నీళ్ళు కూడా త్రాగబుద్ధవలేదు. చచ్చిపోతాననే భయంతో ఒక్కగాలిని మాత్రం వదలకుండా పీలుస్తూ ఆలోచనల్లో మునిగితేలాడు.

ఆలోచించగా చించగా.మధ్యాహ్నం పడుకున్నవాడికి సరిగ్గా నడిఝామున ఒక మంచి ఆలోచన మెదిలింది.

దాంతో ఉత్సాహంగా ఉలిక్కిపడ్డాడు

మొదట స్నానాల గది తడికదాకా వెళ్ళిపోయాడు

గది దాటేసరికి-సుబ్బారావు ఇంట్లోంచి సన్నటి మూలుగు వినిపించింది.

ఆగాడు. "పాపం చంటివాళ్ళకు జ్వరం పాడూ ఏదైనా వచ్చిందేమో ? పెద్దాళ్ళు నిద్రలో ఉండిఉంటారు."అనుకొని లేపెందుకై. వాళ్ళ తలుపు దాపుకు అడుగులు వేశాడు చంద్రప్ప.

"అబ్బ: ఛీ! ఊరుక్కుందురూ!" అని వినిపించింది

అది పసిపిల్లల గొంతు కాదు రేవతిది. గోముగా అంటున్న మాటలవి.

గుండె ఝల్లుమంది చంద్రప్పకు.

తలుపు దగ్గరికెళ్ళి ఏదైనా కంత పుందేమోనని ఆతురతగా పరిశీలించాడు. ఈ పరిశీలనలో ఇంకా ప్రకరకాలైన శృంగార శబ్దాలు వినిపించినయి చంద్రప్పకు. అరకొరగా కనిపిస్తున్న సందులు రెండు కనిపించినయి కాని ఆవగింజలో అరవయ్యో భాగం కూడా కనిపించలేదు.

'అబ్బ!" అని విడిపోతున్న ఉచ్ఛ్వాశ నిశ్వాసలు కూడా వినిపించినయి. అంతు లేని కసి. కోపం. శరీరం నిండా వేడి. ఏం చేయలేని పిరికితనం. ముప్పిరిగొని. నిజంగా చంద్రప్పను పిచ్చివాణ్ణి చేసినయి.

ఇక ఆ తరువాత రంధ్రంకోసం వెతక లేదు.

బావి వద్దకు పరుగున వెళ్ళి చొక్కా కూడా విప్పకుండానే నలభై ఏభై బకెట్ల నీళ్ళను గబ గబా నెత్తిన గుమ్మరించు కున్నాడు. అప్పటికి గాని-కొంత ఉప శాంతి కలగలేదు- శరీరానికి.

గదిలోకొచ్చి శుభ్రంగా వళ్ళు తుడుచు కొని మంచంపై నడుం వాల్చేసరికి తిరిగి ఆలోచనలు మొదలయినాయి

ఇక లాభంలేదనుకొని - స్నానాల గది తడికవద్దకు నడిచాడు లోపల స్నానం చేస్తున్నవాళ్ళు ఏ కోణం నుంచి బాగా కనిపిస్తారో పరిశీలనగా చూసి మరీ అర్థం కానంత చిన్న రంధ్రాన్ని తడికకు ఏర్పాటు చేశాడు.

ఆ తరువాత ఎందుకోగాని- నిద్రపట్టింది చంద్రప్పకు.

నాల్గయిదు రోజులలోనే చంద్రప్పకు కన్నంగలోంచి చూసే అవకాశం దొరికింది. చూశాడు కూడా.

కానీ- కొంచెం ఆలస్యమైంది.

చూపు పడేసరికి రేవతి చీర కట్టు కొనడం కూడా పూర్తయింది. అయితే- చంద్రప్ప- పట్టువదలని విక్రమార్కుడిలా చూస్తుండగా చూస్తుండగా-ఒకనాడు- అత నికి కావల్సిన పద్ధతిలో రేవతి కనిపించింది. ఆ రోజు నుంచి- తిక్కలేగిన గంగిరెద్దులా మారిపోయాడు చంద్రప్ప. నవ్వుతూ కేరింతలు కొడుతూ బజార్లెంట ఉత్సా హంగా తిరిగాడు.

ఆడపిల్ల కనిపిస్తేచాలు- వికారంగా నవ్వే వాడు.

అసభ్యంగా చేతులాడించేవాడు.

ముద్దెట్టుకుంటున్నట్టు- పెదాలు సాగ దీసుకునేవాడు చంకలు కొట్టుకొంటూ గుండ్రంగా వూగి- గెంతులేసేవాడు. ఇలా పది పదిహేను రోజులయిం తరువాత- చంద్రప్పను పోలీసులు పట్టుకెళ్ళారని తెలిసి. మేనమామ రాగప్ప స్టేషనుకెళ్ళాడు.

అది ఎండా కాలం ఒక ఆడ కూతురు ఆరుబయట ఇంటి ముందు పడు కొని ఉంటే- అర్థరాత్రి పూట అదాటుగా ఆమె మంచంపైకెక్కి- చీరె లాగాడట. భయపడి కేకలేసి. అల్లరి చేసిందట. పట్టు కొన్నవాళ్ళే మోచంద్రప్పనుపోలీసులకప్ప జెప్పారు.

చంద్రప్ప వయసిప్పుడు- ముప్పై అయిదు.

పెద్ద మరదలికి- రామలక్ష్మణుల్లాంటి పిల్లలు కలిగారు.

విశాలాక్షి- ఫారెస్టు ఆఫీసులో పనిచేసే రామోజీని పెళ్ళాడింది.

రేవతి. సుబ్బారావులు- తాలూకాకు బదిలీ అయ్యారు.

మామ. మేనమామ అయిన రాగప్ప- ఇద్దరాడపిల్లలకూ మంచి సంబంధాలు దొరక డంతో- సంతృప్తిగా గాలి పీల్చుకున్నాడు.

పాపం చంద్రప్ప మాత్రం- పిచ్చాసు పత్రిలో పర్మనెంటు మెంబరయ్యాడు.

["వాయొరిజం" అనేది మానసిక వ్యాధి అంటారు డాక్టర్లు.]

*


## నూతన యవ్వనం పొందండి



సంతానవంతులు కండి!
చర్మవ్యాధులనుండి
విముక్తులు కండి!

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత. దాంపత్య సుఖము లేక పోవుట. ఉబ్బసము. మేహ మచ్చలు. మొదలగు సమస్త దీర్ఘ వ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స!
పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: *ప్రతి ఆదివారం భీమవరం—షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు
*ప్రతినెల 1 మరియు 16 తేదీలలో రాజమండ్రి—హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు.

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ – 521 301
ఫోన్స్ : ఆఫీసు : 522 నివాసం : 540



**B.A.. B.Com.. B.Sc.. M.A..**

**M.Com.. M.Sc.. B.Ed.. M.Ed.,**

**MAITHILI UNIVERSITY :** Above 25/35 years can appear B.A., B.COM., B.SC., M.A., M.COM., M.SC. (Maths) without basic qualification. B.Ed. only for Graduates. Exam. Nov–'85.

**COMMERCIAL UNIVERSITY :** Above 25/35 years can appear B.COM./ M.COM. without basic qualification. Exam. Nov '85.

**OSMANIA UNIVERSITY :** B.A., B.COM., final for INTER/ PUC/ H.S.C Exam. Nov. '85. M.A., M.COM., M.SC. (Maths) for graduates. Last date : 20-4-'85.

Prospectus Rs. 5/- by M.O./P.O.

## KANCHI EDUCATIONAL INSTITUTE

7, Sardar Patel Road, Adyar,
MADRAS–600 020. Phone : 417954.